క్లుప్తంగా

పోలీసులకు వైద్య శిబిరం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న హోమ్ గార్డులు, రిటైర్డ్ పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా భద్రాచలం ఇన్‌చార్జ్ డీఎస్పీ వంగా రవీంధర్ రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైద్యుల ఈ శిబిరంలో పాల్గొని పోలీసులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శిబిరం ముగిసిన అనంతరం వైద్యులను డీఎస్పీ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు, ఎస్‌ఐలు విజయలక్ష్మి, మధుప్రసాద్, వైద్యులు సంతోష్, శ్రీనిధి, శ్రీక్రాంతి, సాయితేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

చర్ల: చర్లలోని శాఖా గ్రంథాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఎస్ అగ్రిటెక్ సంస్థ వారు శనివారం రూ.30 వేల విలువ చేసే పుస్తకాలను అందజేశారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధినేత పూసపాటి అశోక్, డైరెక్టర్ పొద్దుటూరు నాగేశ్వరావుల చేతుల మీదుగా వాటిని గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త దేవభక్తుని రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ అధినేత అశోక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులకు ఉపయోగపడేలా వీటిని అందజేసినట్లు ఆయన చెప్పారు. శారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, లైబ్రేరియన్ చుక్కబొట్ల వంశీకృష్ణ, అంకాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

మణుగూరుటౌన్: రీజియన్ పరిధిలో అందిస్తున్న వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని వాసవీ క్లబ్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని వేణు ఫంక్షన్ హాల్‌లో కడవెండి విశ్వనాథ గుప్తా, పద్మజా అవార్డ్స్ ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆయన డాక్టర్ అన్నం శ్రీనివాసరావు, కడవెండి వేణుగోపాల్, పెండ్యాల రోజాలక్ష్మి, దోసపాటి నాగేశ్వరరావులతో కలిసి మాట్లాడారు. వాసవీక్లబ్ సేవలను అభినందించారు. ఆర్‌సీ విశ్వనాథగుప్తా దంపతులను, తన పరిధిలోని క్లబ్బుల్లో విశేష సేవలు అందిస్తున్న వారిని ప్రశంసిస్తూ జ్ఞాపికలను అందించి సన్మానించారు. దారా నర్సింహారావు, ఐపీసీలు దారా మల్లికార్జునరావు, చారుగుండ్ల శ్రీనివాస్, కొప్పరపు వీరబాబు, బండారు నర్సింహారావు, వనమా రామకృష్ణ, జోన్ చైర్మన్ చిట్టూరి శేషుబాబు, క్లబ్ అధ్యక్షులు కేసా రాజేంద్ర ప్రసాద్, అంజలి ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

దుమ్ముగూడెం: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులకు జీవనభృతి కింద రూ.12,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం భద్రాచలం డివిజన్ కార్యదర్శి సాయన్న మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు సున వీరభద్రం, రామ్ శెట్టి, లక్ష్మి, శంకర్, మారయ్య, శీను, రమేష్ పాల్గొన్నారు.

విజయోత్సవ కళాయాత్ర

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం, లక్ష్మీ నగరం, నర్సాపురం, ములకపాడు సెంటర్‌లలో ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రను ఎంపీడీఓ ఈదయ్య ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డిశంబర్ 7 నాటికి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజాపాలన కళాయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్బులు, నాయకులు గద్దం బాలాజీ, కెల్లా శేఖర్, లంకా ప్రసాద్, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల టీమ్ లీడర్ కాంపల్లి బాలు,అలవాలా కృపానందం, గురవయ్య, షేక్ ముసా, స్నేహ, కౌసర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షించారు.

పరిశుభ్రత పాటించాలి

భద్రాచలంటౌన్: పాఠశాలలో విద్యార్థులు భోజనం తయారు చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఎంఈఓ తోటమళ్ళ రమ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయగా.. ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వడించే అహార పదార్థులు ఐఎస్ఐ మార్కు కలిగి ఉండాలని, పూర్తిగా ఉడికించిన ఆహారాన్ని విద్యార్థులకు సరఫరా చేయాలని సూచించారు.

ఊరూరా రైతు పండుగ

రైతు పండుగను పురస్కరించుకుని మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో శనివారం సంబురాలు చేశారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆధికారులు, రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. రుణమాఫీ, సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లింపులపై బాణాసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోపే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కుతుందని అక్కడి నాయకులు పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే పాయం, నాయకులు, రైతులు



దమ్మపేట: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పామాయిల్ సలహాదారు కమిటీ సభ్యులు



ములకలపల్లి: రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న దృశ్యం



చంద్రుగొండ: రైతు సంబరాల్లో మాట్లాడుతున్న గానుగపాడు సొసైటీ చైర్మన్ చందర్‌రావు

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీల కోసం తయారు చేసిన ఆహారాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సబ్‌జైలును శనివారం భద్రాచలం కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఖైదీలతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. నేర ప్రవృత్తికి దూరం కావాలని, కుటుంబం కోసం జీవించేలా పరివర్తన చెందాలని సూచించారు. జైలులో ఉన్న భోజనశాలను తనిఖీ చేసి ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీయగా.. వారానికి రెండు రోజులు ములాకత్తు, రెండు రోజులు ఫోన్ సౌకర్యం, గ్రంథాలయ సౌకర్యం, తక్షణ వైద్య సౌకర్యం అందజేస్తున్నామని సబ్ జైల్ అధికారి తెలిపారు. ఎన్నో రోజుల తరబడి జైల్లో ఉన్నవారికి ఫ్రీ లీగల్ ఎయిడ్ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ జైల్ అధికారి ఉపేందర్, ప్యానల్ న్యాయవాదులు శారద, సంధ్య, మాధవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

అశ్వాపురం: మండలంలో డిసెంబర్ 3న ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భిక్షమయ్య ఆధ్వర్యంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భిక్షమయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 3న మండలంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరవుతారవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు. సమావేశంలో అశ్వాపురం పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గాదె వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, కొండబత్తుల ఉపేందర్, బాణోత్ సదర్‌లాల్, చాప ముత్తయ్య, జానపాటి నాగేశ్వరరావు, అలిశెట్టి శ్రీను, యక్కటి సత్యనారాయణరెడ్డి, బూతం వెంకన్న, వీరభద్రం, రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భిక్షమయ్య

కొనుగోలు కేంద్రాల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీసీఓ ఖుర్షీద్

ములకలపల్లి: పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు (పీపీసీ సెంటర్లు)ను జిల్లా కోఆపరేటివ్ అధికారి (డీసీఓ) ఖుర్షీద్ శనివారం పరిశీలించారు. మాధారం సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రికార్డులు పక్కాగా నిర్వహించాలని అన్నారు. రైతులకు అసౌకర్యం కలిగించవద్దని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని, త్వరితగతిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారని తెలిపారు. సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, సెంటర్ ఇన్‌చార్జ్ కామేశ్ ఉన్నారు.

జీవన భృతి అందించాలి

ములకలపల్లి: వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు జీవన భృతి చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మాస్‌లైన్ కార్యాలయం నుంచి తహసీల్ వరకు శనివారం ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేశారు. మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ మండల కార్యదర్శి శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, ఎర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, పద్దం లక్ష్మణరావు, నూపా సరోజిని, మిడియం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామం వద్ద మణుగూరు ఎస్సై తన సిబ్బందితో కలిసి శనివారం వాహనాలను తనిఖీ చేశారు. మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి సంబంధిత పత్రాలను, పెండింగ్ చలాన్ల వివరాలను పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలను సేకరించి వదిలేశారు. సరైన పత్రాలు లేని వాహన యజమానాలను ఈ–చలానాలను విధించారు. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పరిసర ప్రాంతాల్లో డిసెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విడతల వారీగా పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్, భద్రాచలం పశువైద్యశాల అధికారి డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్, మామునూర్ పశువైద్య కళాశాల నుంచి వచ్చే అధికారుల, సిబ్బందితో పాటు పశుసంవర్ధకశాఖ అధికారులు ఈ వైద్య శిబిరాలలో పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. మొదటిగా నేడు బూర్గంపాడు మండల పరిధిలోని రెడ్డిపాలెంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి జిల్లా కలెక్టర్ జితేష్.వి పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొననున్నారని ఆయన తెలిపారు.

రేపటి నుంచి లెప్రసీ సర్వే

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ఈ నెల 2వ తేదీ నుంచి లెప్రసీ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. 2వ తేదీ నుంచి 14 వరకు ఇంటింటి సర్వే ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చేయాల్సి ఉంటుందని డాక్టర్ ప్రియాంక వెల్లడించారు. సమావేశంలో తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి, డిప్యూటీ పారమెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రేవతి

ములకలపల్లి: ములకలపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి.రేవతి పదవీ బాధ్యతలు స్వీకరించారు. మరిపెడ బంగ్లా ఎంపీడీఓగా విధులు నిర్వహించే రేవతి, గత ఐదు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ములకలపల్లి ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఇన్నాళ్లు వ్యక్తిగత సెలవులో ఉన్న రేవతి, శనివారం డ్యూటీలో చేరారు.

జాతర తేదీలు ఖరారు

దుమ్ముగూడెం: గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తేదీలను ప్రకటించారు. శనివారం ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో జాతర తేదీలను ప్రకటించారు. రెండేళ్లకోసారి నిర్వహించే అమ్మవారి ఈ జాతరను వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 11వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ, స్టీరింగ్ కమిటీ నిర్ణయించింది. అలాగే గత జాతరకు సంబంధించి జమా ఖర్చులను ఈ గ్రామసభలో పరిశీలించారు.

బాలమల్లేష్ మృతి బాధాకరం

భద్రాచలంఅర్బన్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్ మరణం అత్యంత బాధాకరమని సీపీఐ రాష్ట్ర, జిల్లా సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్ అన్నారు. శనివారం మల్లేష్ మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

హామీలు అమలు చేయాలి

చంద్రుగొండ: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయని పక్షంలో దశలవారి ఆందోళనలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలకేంద్రం చంద్రుగొండలో శనివారం ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. ఈసభలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనను రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్నాడని విమర్శించారు. ఫార్మసీ కంపెనీలకు పేద రైతుల భూములను ధారదత్తం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునే రైతులపై కేసులు బనాయించి జైళ్లపాలు చేయడం దురదృష్టకరమన్నారు. రైతుల రుణమాఫీ వెంటనే చేయాలని, రైతుభరోసా పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మండల కన్వీనర్‌గా పెద్దిని వేణు

సీపీఎం మండల కన్వీనర్‌గా పెద్దిని వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌తోపాటు మరో 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఐలూరి రామిరెడ్డి, కాక సీత, బన్నె సత్యం, మిర్యాల మోహన్‌రావు, నాగుల్‌మీరా, వెంకటాచారి, గాలి రామారావు, భద్రం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మణుగూరు వైపు వెళ్తున్న ఆటో కల్యాణపురం వద్ద గేదెను తప్పించబోయి బోల్తా పడింది. ఆటోలో ఉన్న కమలాపురంలోని గురుకుల బాలికల పాఠశాల నైట్ వాచ్‌మెన్ జ్యోతి, ఉప్పుసాక ఆశ్రమ పాఠశాల టీచర్ భద్రుకు గాయాలయ్యాయి. ఇద్దరిని 108లో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా జ్యోతిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

బంద్ విజయవంతం

ములకలపల్లి: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. బంద్‌ను పురస్కరించుకుని మండలకేంద్రంతోపాటు పూసుగూడెం, జగన్నాథపురం, మాధారం తదితర గ్రామాల్లోని పాఠశాలలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా సంఘ మండల నాయకులు కీసరి స్వాతి, పుష్పాల చరణ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

103 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో నవంబర్‌కు సంబంధించి 103 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. ఓబీ వెలికితీత లక్ష్యాన్ని 91 శాతం సాధించామని వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. నవంబర్‌లో 11.58 లక్షల టన్నులకు గాను 11.90 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైందని తెలిపారు. అలాగే, ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు రైలు, రోడ్డు మార్గాలతో పాటు రోప్ ద్వారా 71.49 లక్షల టన్నులు తరలించామని చెప్పారు. కాగా, మణుగూరు ఏరియాలో క్వార్టర్ల నిర్మాణం, ఓసీ విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, లక్ష్మీపతి గౌడ్, వెంకట్రావు, శ్రీనివాస్, సలగల రమేష్, శేషగిరి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాంచందర్

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు



కూరగాయల నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేష్

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దమ్మపేట తహసీల్దార్ సీహెచ్.నరేష్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణ అంతా కలియ తిరిగి, సమగ్రంగా పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, మొక్కలను పెంచి తద్వారా పచ్చదనంను పెంచుకోవాలని హెచ్ఎం శారదకు సూచించారు. స్టోర్ రూమ్‌లో కూరగాయాలు, వంట సరుకులను తనిఖీ చేశారు. వంట గదిలో ఆహారం వండుతున్న తీరును, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం క్రమం తప్పకుండా నాణ్యత, పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. టాయిలెట్లు, వసతి గదులను పరిశుభ్రంగా ఉంచుతూ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మెనూ, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నత అధికారులకు తెలియజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరాస్వామి, పీఈటీ నాగమణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. శనివారం అశ్వారావుపేటలోని జవహర్ విద్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ.. రోజురోజుకూ సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జరుగుతున్న మోసాలపై వివరించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్, పాన్ కార్డులు అడితే ఇవ్వొద్దని, జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. సైబర్ నేరాలు గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించి, అవగాహన కల్పించాలని అన్నారు. అదే విధంగా లైగింక వేధింపులు జరిగితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ మైథిలీ, ప్రవీణ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది రామారావు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఓ పత్రం అందజేత

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన వాసం రాణికి మార్కెట్ కమిటీ కార్యదర్శి రాము నియామక జీఓ పత్రం అందజేశారు. శనివారం మండలంలోని పట్వారిగూడెం నివాసంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను, ఆ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రాము, కిరణ్‌కుమార్, గవర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేటరూరల్: ఏళ్లుగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అశ్వారావుపేట సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులను పోరాటాలు చేసేందుకు డిసెంబర్ 4, 5వ తేదీల్లో జిల్లాలోని పాల్వంచలో రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం శిక్షణా తరగతుల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు పఠాన్ జలాల్ ఖాన్, దోమల అనిల్, అబ్బాస్, జక్కం బలరాం, ఎస్‌కే రిజ్వానా, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

స్వెట్టర్లు, చెప్పులు పంపిణీ

బూర్గంపాడు: చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హాస్టళ్లలోని విద్యార్థులకు అందించిన స్వెట్టర్లు, చెప్పులను శనివారం మండల అధికారులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఎస్ఎస్‌డీసీ(బాలికలు), ఎస్సీ(బాలుర) వసతి గృహాల విద్యార్థులకు స్వెట్టర్లు, చెప్పులతో పాటుగా డిక్షనరీలను తహసీల్దార్ ఎండీ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంఈఓ యదుసింహరాజు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాలలో హాస్టల్స్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామ సభ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గోదావరి కరకట్ట పనుల నిమిత్తం శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు పాల్గొనగా.. పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు గ్రామసభను ప్రారంభించారు. కరకట్ట నిర్మాణానికి సంబంధించి జరిగిన భూసేకరణలో అభ్యంతరాలు ఉంటే సభ ముందు ఉంచాలని కోరారు. కరకట్ట నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులు మొత్తం 14 మంది ఉండగా వారిలో కేవలం ఒక్క రైతు మాత్రమే పాల్గొని మాట్లాడుతూ.. అధికారులు తనకు ఎరానికి కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పారని, ప్రస్తుతం ఉన్న మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని అధికారులను కోరాడు. స్పందించిన అధికారులు పరిశీలించి నష్ట పరిహారాన్ని అందజేస్తామని తెలిపారు. అనంతరం సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరకట్ట నాణ్యత విషయాన్ని లేవనెత్తగా.. క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యతను దగ్గరుండి పరిశీలించినట్లు అధికారులు బదులిచ్చారు. పరిహారంలో ఏమైనా అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఆర్డీఓ తెలిపారు. భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈఈ మధుసుధన్, జేఈ వెంకటేష్, భద్రాచలం టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు